బచ్చన్నపేటలో రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు, రాజకీయ పార్టీల నేతలు

దుర్గమ్మ ఆలయ స్థలాన్ని కబ్జా చేస్తే ఊరుకోం

బచ్చన్నపేటలో అఖిలపక్షం ఆధ్వర్యంలో రాస్తారోకో

బచ్చన్నపేట, జనవరి 10 : మండల కేంద్రంలోని దుర్గమ్మ ఆలయ పరిధిలో ఉన్న స్థలాన్ని కబ్జా చేసేందుకు కొందరు ముస్లింలు అధికారులతో కుమ్మక్కయ్యారని బచ్చన్నపేట గ్రామంలోని అన్ని రాజకీయ పార్టీల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఏడీఎంసీ తప్పుడు రిపోర్టు, సర్వే చేసి ముస్లింలకు మద్దతు పలుకడంపై ప్రజలు మండిపడ్డారు. అందులో భాగంగానే శుక్రవారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం, సీపీఐ పార్టీల నేతలు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల బాధ్యులు నల్లగోని బాలకిషన్‌గౌడ్, వడ్డేపల్లి మల్లారెడ్డి, పులిగిళ్ల పూర్ణచందర్ మాట్లాడుతూ ఏండ్ల నుంచి 3ఎకరాల భూమి గ్రామ పంచాయతీ పేర రికార్డుల్లో దుర్గమ్మ ఆలయ పరిధిలో ఉందన్నారు. పాసుపుస్తకం సైతం ఉందని, అయినా కొందరు స్వార్థంతో ప్రత్యేక పాలన ఉన్న సమయంలో అధికారులకు మామూళ్లు ముట్టచెప్పి గ్రామ పంచాయతీ స్థలాన్ని కొట్టేయ్యాలని కుట్రలు చేస్తున్నారని అన్నారు. గతంలో కూడా ఇదేవిధంగా జరిగితే గ్రామస్తులం అడ్డుకున్నామని, కోర్టు తమకే డిగ్రీ ఇచ్చి గ్రామ పంచాయతీదే స్థలం అని స్పష్టం చేసినట్లు తెలిపారు. ఏండ్ల కిందట నుంచే గ్రామ పంచాయతీ పేర ఉన్న స్థలాన్ని కొట్టేసేందుకు కుట్రలు చేస్తుంటే ప్రజలను కాదని ఏడీఎంసీ, ఆర్ఐలు వచ్చి ఎలా సర్వే చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా కలెక్టర్ ఆ ఏడీఎంసీ రిపోర్టును రద్దు చేసి ప్రజల ఆస్థిని కాపాడాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమని వారు హెచ్చరించారు. లంచం తీసుకుని పని చేస్తున్న అధికారుల భరతం పడ్తామని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయాపార్టీల నాయకులు , ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సూరారంలో పశు వైద్య శిబిరం

పశువులకు టీకా వేస్తున్న వైద్యుడు

జఫర్‌గడ్, జనవరి 10 : మండలంలోని సూరారం గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం, గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మండల పశు వైద్యాధికారి డా. సీహెచ్ రజిత, ఉప్పుగల్లు పశు వైద్యాధికారి డా శ్రీనాథ్ హాజరై మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఏకే మంజుల, గోపాల మిత్ర సూపర్‌వైజర్ రాజేశ్వర్‌రావు, గుజ్జరి రాజు, చిలువేరు నగేశ్, లచ్చయ్య పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

ఐద్వా జనగామ జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య

సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల

జనగామ చౌరస్తా, జనవరి 10 : కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీల్లో భాగంగా ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జనగామ జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఐద్వా కార్యాలయంలో క్రియాశీల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు అహల్య మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులో మాత్రమే మహిళలకు ఉచిత ప్రయాణం కోసం జీరో టికెట్లు ఇస్తున్నారని తెలిపారు. సరిపడా బస్సులు లేకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గృహజ్యోతి, గృహలక్ష్మి అని ముద్దుగా పేర్లు పెట్టారు తప్పా మహిళలకు నెలకు రూ.2500 ఇవ్వడం లేదని విమర్శించారు. కొత్త రేషన్‌కార్డులు లేవు, ఒంటరి మహిళలు, వితంతు, వృద్ధాప్య, దివ్యాంగుల పింఛన్‌లు లేవని తెలిపారు. రైతు రుణమాఫీ కొందరికే వచ్చిందని, రైతు భరోసా ఊసే లేదన్నారు. వంట గ్యాస్ సబ్సిడీ అమలు కావడంలేదన్నారు. నిత్యవసరాల ధరలు పెరగడంతో సామాన్యులు, పేదలు తిండి తినే పరిస్థితుల్లో లేరని ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ షాపుల ద్వారా 14రకాల సరుకులు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగం, ఉపాధి లేకపోవడంతో పేద ప్రజలు మైక్రో ఫైనాన్స్ సంస్థల వద్ద వారం, నెల చిట్టీల పేరిట అప్పులు తీసుకొని కట్టలేని పరిస్థితుల్లో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. అధిక వడ్డీలు వసూలు చేసే మైక్రో ఫైనాన్స్ సంస్థలను బ్యాన్ చేసి, బ్యాంకుల ద్వారా షూరిటీ లేకుండా అర్హులైన పేదలకు రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పేదలు సొంత ఇండ్లు నిర్మించుకోవడానికి ఇంటి స్థలంతోపాటు ఇంటి నిర్మాణం కో సం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.10లక్షలు ఆర్థిక సహాయం అందజేయాలన్నారు. బీజేపీ ప్రభుత్వం మహిళలను చులకనగా చూస్తూ మనువాద భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్నారని విమర్శించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలతోపాటు బీజేపీ నేత రమేశ్ బిదూరి కాంగ్రెస్ పార్టీ వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీపై చేసిన వ్యాఖ్యలు సిగ్గు చేటు అన్నారు. బిదూరిని బీజేపీ నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ షబానా, జిల్లా నాయకురాలు బండ రమాదేవి, కల్యాణి, శ్రీలత, అనిత, నిర్మ ల, శోభ, మమత, జయ, సుజాత, సు నంద, శోభారాణి, అంజమ్మ, బేబీ పాల్గొన్నారు.

12, 13న సంక్రాంతి క్రీడలు, కళా ప్రదర్శనలు

మాట్లాడుతున్న లింగనబోయిన శ్రీకాంత్

స్టేషన్ ఘన్‌పూర్, జనవరి 10 : ఈనెల 12, 13 తేదీల్లో కామ్రేడ్ తీగారం నర్సయ్య, కామ్రేడ్ లింగనబోయిన వెంకటయ్య స్మారకార్థం నిర్వహించే సంక్రాంతి క్రీడలను జయప్రదం చేయాలని ప్రజానాట్యమండలి గ్రామ కార్యదర్శి లింగనబోయిన శ్రీకాంత్, డీవైఎఫ్ఐ గ్రామ కార్యదర్శి నీరటి సంపత్ ప్రజాసంఘాల సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఇప్పగూడెం ఆవాస గ్రామాలు (అక్కపెల్లిగూడెం, రంగరాయిగూడెం, కోమటిగూడెం) స్థాయిలో భారత ప్రజాతంత్ర యువజన సమైక్య, ప్రజానాట్యమండలి వారి ఆధ్వర్యంలో ఇప్పగూడెం హైస్కూల్లో కబడ్డీ, వాలీబాల్, ముగ్గులు, షటిల్ లో క్రీడలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. అలాగే ఈనెల 14న సంక్రాంతి సందర్భంగా కళాకారులతో కోలాటం, గొల్లడోలు, డప్పులతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. క్రీడాకారులు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు. క్రీడల్లో విజేతలకు నగదు ప్రోత్సాహంతోపాటు షీల్డ్ అందిస్తామన్నారు. క్రీడాకారులు 99487 42545, 9963336072లను సంప్రదించాలన్నారు.

జనగామలో పోలీసుల ముమ్మర తనిఖీలు

బస్టాండ్‌లో తనిఖీలను పరిశీలిస్తున్న ఏఎస్పీ చేతన్ నితిన్

జనగామ చౌరస్తా, జనవరి 10 : జిల్లా కేం ద్రంలో శుక్రవారం జనగామ ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్ ఐపీఎస్ ఆధ్వర్యంలో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ (ర్యాడో) బృందాలతో కలిసి అర్బన్ పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లోని పార్సిల్‌కౌంటర్, కంట్రోలర్ రూమ్, బైక్ పార్కింగ్ ఏరియాతోపాటు బస్సుల్లో వెళ్లే ప్రయాణికుల బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం రైల్వేస్టేషన్, బతుకమ్మకుంట, మినీస్టేడియం, జనం రద్దీగా ఉండే ప్రాంతాలు, ప్రధాన కూడళ్లలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎస్పీ చేతన్ నితిన్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ, రిపబ్లిక్‌డే వేడుకల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఎవరైనా అనుమానితుల కదలికలు ఉన్నట్లు కనిపిస్తే వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. శాంతి భద్రతలను కాపాడడంలో పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ తనిఖీల్లో అర్బన్ సీఐ పీ దామోదర్‌రెడ్డి, ఎస్సైలు రాజేశ్‌కుమార్, భరత్, రాజన్‌బాబు, ఏఎస్సై సాంబారెడ్డి, బాంబ్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

దేవాదుల నీటితో చెరువులు, కుంటలు నింపాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి రాపర్తి రాజు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు రాపర్తి రాజు

చిల్పూరు, జనవరి 10 : దేవాదుల ప్రాజెక్టు మల్లన్నగండి రిజర్వాయర్ ఎడమ తూము ద్వారా కాలువలకు నీళ్లు వదిలి మండలంలోని ఆయా గ్రామాల చెరువులు, కుంటలు నింపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ సమావేశం శుక్రవారం మండల కమిటీ సభ్యుడు ఆవుల ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాజు హాజరై మాట్లాడారు. చిల్పూరు మండలం అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. మండలాభివృద్ధికి సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. మండలం చుట్టూ రిజర్వాయర్లు ఉన్నప్పటికీ రైతులకు పంట భూములకు సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర కాలం గాడిచినా సాగునీరు అందించలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న గౌరవెల్లి ప్రాజెక్టు పనులను సత్వరమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాల నిర్మాణం చేపట్టాలని కోరారు. మండలంలో సాగుభూమి, ఇండ్లు, ఇండ్ల స్థలాలు, రేషన్‌కార్డులు, పెన్షన్లు, అర్హులైన పేదలకు ఇవ్వాలన్నారు. మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సీపీఎం నిర్వహించే ప్రజా ఉద్యమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మునిగేల రమేశ్, పార్టీ మండల కార్యదర్శి సాదం రమేశ్, మండల కమిటీ సభ్యులు కన్నబోయిన రవి పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోవాలి

జనగామ చౌరస్తా, జనవరి 10 : జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరానికిగాను పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం మార్చి 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ సంక్షేమశాఖ జిల్లా అధికారి విక్రమ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. స్కాలర్‌షిప్ కోసం విద్యార్థులు ఆన్‌లైన్ వెబ్‌సైట్ ఐడీ www.telanganaepass.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబురాలు

- ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- హరిదాసుల వేశధారణలో ఆకట్టుకున్న చిన్నారులు

చిల్పూరు : పల్లగుట్టలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

దేవరుప్పుల, జనవరి 10 : మాధాపురం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు సంక్రాంతి సంబురాలు జరుపుకున్నారు. హెచ్ఎం నల్ల లలిత నేతృత్వంలో ఈ వేడుకలు జరుగగా సంక్రాంతి పండు గ ప్రాముఖ్యతను తెలుపుతూ విద్యార్థులు ముగ్గుల పోటీలు, హరిదాసుల వేశధారణలు, భోగి మంటలు, పతంగుల ఎగురవేతలతో అలరించారు. అనంతరం ఉత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు సుర్జీత్, జీవన్, అంగన్‌వాడీ టీచర్లు విజయ, రజిత ఉన్నారు.

హన్మంతాపూర్‌లో..

నర్మెట : మండలంలోని హన్మంతాపూర్ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో సప్తవర్ణ రంగులలో విద్యార్థులు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. బాలురు గాలిపటాలు ఎగురవేశారు. రాగిపిండి, బెల్లంతో చేసిన లడ్డూలను, చికెన్‌తో బగారా భోజనాన్ని విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం కేశవరావు, దూడల రమేశ్, ఉపాధ్యాయులు పీ సంధ్యారాణి, ఎండీ ఆపీఫ్ తెలిపారు.

పల్లగుట్టలో ముగ్గుల పోటీలు..

చిల్పూరు : మండలంలోని పలగుట్ట ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ తృతీయ బహుమతులను హెచ్ఎం కేతుడి నరసింహారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోమల్లలో..

రఘునాథపల్లి : మండలంలోని కోమల్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సంక్రాంతి పండగను పురస్కరించుకుని శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు హెచ్ఎం జాన్సుందర్‌రావు బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు సంతోషిరెడ్డి, సురేశ్, మాధవి, అన్నపూర్ణ, పుష్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

శివునిపల్లి యూపీఎస్‌లో..

స్టేషన్ ఘన్‌పూర్, జనవరి 10 : మండలంలోని శివునిపల్లి యూపీఎస్ పాఠశాలలోని విద్యార్థులకు సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు జనవరి 26న బహుమతులు అందించనున్నట్లు హెచ్ఎం పవన్, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రఘునాథపల్లి : కోమల్లలో వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

స్టేషన్‌ఘన్‌పూర్ : శివునిపల్లి యూపీఎస్ పాఠశాలలో

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOTS FOR SALE

★Hyd. హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కొహెడ శ్రీమిత్ర, బాటసింగారం, తూప్రాన్‌పేట్, పోచంపల్లి శ్రీమిత్రలో ప్లాట్లు కొనబడును. No Brokers. 9553973999 / 6303049720.

NT-326614

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

జనగామ చౌరస్తా, జనవరి 10 : లయన్స్‌క్లబ్ ఆఫ్ మిలీనియం ఆధ్వర్యంలో శుక్రవారం జనగామ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా పరీక్ష ప్యాడ్లతో పాటు డిక్షనరీలు పంపిణీ చేశారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వలబోజు కృష్ణమూర్తి, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు రేగూరి వెంకటరమణారెడ్డి, నర్సిరెడ్డి, ప్రవీణ్‌కుమార్, శ్రీరామ్ శ్రీనివాస్, శ్రీనివాస్‌రావు, మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు నర్సింహారెడ్డి, కనకయ్య, అఫ్సర్, అనిత, మంజుల, సుమలత, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బాణాపురం వద్ద అండర్ బ్రిడ్జి నిర్మించాలి

జనగామ చౌరస్తా, జనవరి 10 : జనగామ పట్టణంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న నేషనల్ హైవే ఔటర్ రోడ్డు పనుల్లో భాగంగా బాణాపురం వద్ద అండర్ బ్రిడ్జి నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కొత్తగా నిర్మిస్తున్న హైవే రోడ్డు పనులను కనకారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లంల, సిద్దెంకి, పెదరాంచర్ల, పోచన్నపేట, సిద్దిపేట, హైదరాబాద్ రోడ్లను కలుపుతున్న రోడ్డును బ్లాక్ చేయకుండా బాణాపురం వద్ద అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని తెలిపారు. బ్రిడ్జి ఏర్పాటు వల్ల ప్రజలు ప్రమాదాలబారిన పడకుండా ఉండే అవకాశం ఉంటుందన్నారు. అండర్ బ్రిడ్జి నిర్మించకుంటే పెద్ద ఎత్తున ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్, జిల్లా కమిటీ సభ్యులు చందు, నరేందర్, కల్యాణి, వెంకటమల్లయ్య, లింగం, శ్రీకాంత్, ప్రశాంత్, బీరయ్య, మల్లేశ్, అంజమ్మ, రజిత, శ్రీలత, జయ, కమల, మమత, దినేశ్, వెంకటేశ్వర్లు, బాబు, మహేశ్వరి పాల్గొన్నారు.



ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు శుక్రవారం యాదాద్రికి వెళ్లి లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆయనకు అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. - దేవరుప్పుల

జనగామ చౌరస్తా : టీజీవో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అధికారులు

టీజీవో క్యాలెండర్ ఆవిష్కరణ

జనగామ చౌరస్తా, జనవరి 10 : తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) జనగామ జిల్లా శాఖ 2025నూతన క్యాలెండర్‌ను శుక్రవారం కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయడంలో గెజిటెడ్ అధికారుల పాత్ర కీలకమైందని కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, టీజీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రగిరి శ్రీనివాస్, నీలం కోర్నేలియస్, అసోసియేట్ అధ్యక్షుడు సారంగపాణి, కోశాధికారి గౌస్, ఉపాధ్యక్షులు ఎన్ స్వరూప, రాజేంద్ర కుమార్, జయపాల్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ మన్సూరి, వీరస్వామి, సంపత్‌కుమార్, విజయ్ కుమార్, సునీల్ కుమార్, కమలాకర్, మల్లికార్జున్, కృష్ణారెడ్డి, సురేశ్ కుమార్ పాల్గొన్నారు.

వీఎస్ఎఫ్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

జనగామ పట్టణంలోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వందేమాతరం స్టూడెంట్ ఫెడరేషన్ (వీఎస్ఎఫ్) 2025 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ వైద్యుడు డాక్టర్ సీహెచ్ రాజమౌళి, విశిష్ట అతిథిగా వీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మంగళంపల్లి రాజు హాజరై క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండ్ర ప్రవీణ్, జిల్లా అధ్యక్షుడు నల్ల రాహుల్, పట్టణ అధ్యక్షుడు ఇమ్రాన్, నాగేందర్, కిరణ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఐ సొసైటీ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఆర్డీవో

స్టేషన్ ఘన్‌పూర్ : ఉమ్మడి వరంగల్ జిల్లా ఆర్టీఐ, హ్యూమన్ రైట్స్ సొసైటీకి సంబంధించిన క్యాలెండర్‌ను శుక్రవారం ఆర్డీవో డీఎస్ వెంకన్న ఆవిష్కరించారు. డివిజన్ కేంద్రంలోని తన కార్యాలయంలో ఆర్టీఐ, హ్యూమన్ రైట్స్ సొసైటీ వ్యవస్థాపకుడు వీరమల్ల సాంబారావుతో కలిసి ఆర్డీవో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు లింగాల సాయన్న, జనగామ జిల్లా అధ్యక్షుడు తాడెం కుమారస్వామి, పల్లెపాటి సోమిరెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ మండల అధ్యక్షుడు మేకల మల్లేశం, మండల సెక్రటరీ కత్తుల రాజు, మునిగెల అశోక్, ఇస్లావత్ రాజేశ్‌నాయక్, తాడెం రేవతి, రుద్రపు స్రవంతి, ఆర్టీఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిల్పూరులో డీటీఎఫ్ ఆధ్వర్యంలో..

చిల్పూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం 2025 డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) మండలశాఖ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను పాఠశాల ఆవరణలో ఆవిష్కరించారు. ఉన్నత పాఠశాల హెచ్ఎం, డీటీఎఫ్ మండల బాధ్యులు కే యాదగిరి, సోమేశ్వరరావు, గోవర్ధన్, రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే చిల్పూరు మండలంలోని రాజవరం జడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో విశ్వ హిందీ దివస్ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు హిందీలోనే తయారు చేసిన 2025క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఎంఈవో గోవర్ధన్, హిందీ ఉపాధ్యాయుడు పోగుల కిషన్‌కుమార్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, శౌరీల, శ్రీదేవి, పద్మాదేవి, సోమేశ్వర్, కృతాత్మమూర్తి, కుమార్ పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో..

బచ్చన్నపేట : మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కేంద్రంలో టీపీటీఎఫ్ రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం ఎంపీడీవో మల్లికార్జున్, ఎంఈవో వెంకట్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నేత శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంకుషావళి, జిల్లా పూర్వ అధ్యక్షుడు బందారపు లక్ష్మయ్య, మండల అధ్యక్షుడు కే మల్లారెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, సంఘం బాధ్యులు పాల్గొన్నారు. అలాగే, కారోబార్ అండ్ గ్రామపంచాయతీ సిబ్బంది అసోసియేషన్ రాష్ట్రశాఖ రూపొందించిన క్యాలెండర్‌ను బచ్చన్నపేటలో ఆ సంఘం నేతలు అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మల్లికార్జున్, గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి వెంకటాచారీ, తహసిల్ కార్యాలయంలో డీటీ ఫణికిశోర్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

నేడు పాలకుర్తికి మాజీ మంత్రి ఎర్రబెల్లి రాక

పాలకుర్తి, జనవరి 10 : పాలకుర్తి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయానికి శనివారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు రానున్నట్లు బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పసునూరి నవీన్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఉదయం 10గంటల నుంచి పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులకు అందుబాటులో ఉంటారని చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు రావాలని కోరారు.

నేడు బీఆర్ఎస్ ఆందోళనలు

ఛలో పాలకుర్తికి పిలుపు

దేవరుప్పుల, జనవరి 10 : ఆర్‌జీ టీవీ రిపోర్టర్ రాజ్‌కుమార్‌పై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపడాన్ని నిరసిస్తూ శనివారం నియోజకవర్గ కేంద్రం పాలకుర్తి, తొర్రూరు మండలకేంద్రాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆందోళనలకు పిలుపునిచ్చిందని బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు తీగల దయాకర్ తెలిపారు. మండలంలోని బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు ఉదయం 10గంటలకు పాలకుర్తి చౌరస్తాలో జరిగే ఆందోళనలో పాల్గొనాలని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పెడితే అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం, ప్రశ్నించే గొంతుకలను నొక్కేసే ప్రయత్నం చేస్తున్న ఈ ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ చేస్తున్న ఈ ఆందోళనలలో పెద్ద ఎత్తున పాల్గొనాలని బీఆర్ఎస్ శ్రేణులకు దయాకర్ పిలుపునిచ్చారు.

అనుమతి లేని ల్యాబ